సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 10 । మార్చి । 2025



భూమి ఒకరిది.. కట్టబెట్టింది మరొకరికి..
డబ్బులిస్తే హక్కుదారులను కాదని, అదే భూమి వైరిపక్షానికి చెందినదిగా ధ్రువీకరణ చేస్తున్నారు. ఇలాంటి ఉదంతం ఖాజీపేట మండలంలో వెలుగు చూసింది.
-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ॥ (సా॥)	సహర్ మంగళ॥ (ఉ॥)
కడప	: 6.30	5.11
పులివెందుల	: 6.32	5.16
ప్రొద్దుటూరు	: 6.31	5.15

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0/19.4

జిల్లాలో ఆదివారం 19.4 – 39.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైభవంగా మహా సంప్రోక్షణ



యాగశాల నుండి పూర్ణకుంభాభిషేకానికి బయలుదేరిన సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం మహా సంప్రోక్షణ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు పాల్గొని పంచసూక్త పవమాన హోమాలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, 10.15 నుంచి 11.30 గంటల వరకు వృషభలగ్నంలో మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, స్వర్ణపుష్పార్చన జరిగపారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో అర్చకులు, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, గోవిందరాజన్, సెల్వం, ప్రశాంతి, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహర్, వీజీఓ సదాలక్ష్మీ, ప్రెస్ అండ్ సేల్స్ వింగ్ ప్రత్యేక అధికారి రామరాజు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'లో అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.

డయల్ యువర్ కలెక్టర్: 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10.00 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలియజేశారు. ప్రజలు 08562-244437 ల్యాండ్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక



మిద్దె ప్రవీణ్ కిరణ్

కడప ఎడ్యుకేషన్: ఏపీ పీఈటీ అండ్ ఎస్‌పీఈ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కడపకు చెందిన మిద్దె ప్రవీణ్ కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప మండల పరిధిలోని నరసరాంపల్లె ఈయన స్వస్థలం. ఆదివారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ప్రవీణ్ కిరణ్‌ను ఎన్నుకున్నారు. ఈయన కడప నగరం చెమ్ముమియాపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 7546 కేసులు పరిష్కారం

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేశారు. ఇందులో క్రిమినల్ కేసులు 7231, 197 సివిల్ కేసులు, 118 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా రూ.26,13,95,784 కక్షిదారులకు చెల్లించారు. కడపలో 2109 కేసులు, పొద్దుటూరు 2082, రాజంపేట 933, రాయచోటి 240, బద్వేల్ 283, జమ్మలమడుగు 1005, సిద్దవటం 137, రైల్వేకోడూరు 157, పులివెందుల 365, నందలూరు 80, లక్కిరెడ్డిపల్లి 26, కమలాపురంలో 129 కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. ఈ కేసుల పరిష్కారానికి తోడ్పడిన వివిశాఖల అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్ జి.శ్రీదేవి , సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్ బాబా ఫక్రుద్దీన్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్నదాన సదనానికి రూ.లక్ష



బ్రహ్మంగారిమఠంలో అన్నదాన సదనానికి విరాళాన్ని అందిస్తున్న చల్లా గంగాదేవి కుటుంబ సభ్యులు

వేముల: బ్రహ్మంగారిమఠంలో నిర్మిస్తున్న పత్రానాయుళ్ల అన్నదాన సదనానికి వేముల మండలం ఎంపీపీ చల్లా గంగాదేవి, చల్లా వెంకటనారాయణలు ఆదివారం లక్ష రూపాయలు విరాళంగా అందించారు. చల్లా వెంకటనారాయణ తండ్రి, మాజీ సర్పంచ్ దివంగత చల్లా పెద్ద వెంకటయ్య, తల్లి రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారు ఈ విరాళాన్ని అందజేశారు. పత్ర సంక్షేమ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్, పత్రా సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు,అధ్యక్షుడుహనుమంతునాయుడు,సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప పాల్గొన్నారు.

పేరులోనేముంది!

- ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారిన 'స్పందన'
- గ్రీవెన్స్‌సెల్ ఫిర్యాదులు వేలాదిగా పెండింగ్
- కూటమి పాలనలో వచ్చినవి 34,997
- టాప్ టెన్ శాఖల్లోనివి 33,502
- రెవెన్యూలో అత్యధికంగా 27,664
- పరిష్కరించినవి 29,474
- పెండింగ్ ఫిర్యాదులు 5,523



కడపలోని కలెక్టరేట్

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం ప్రతి సోమవారం 'స్పందన' పేరిట మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో క్రమం తప్పకుండా ఓ కార్యక్రమం నిర్వహించేది. అర్జీల స్వీకరణ, పరిష్కారం జరిగేది. ఈ కార్యక్రమానికి నాటి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజలు సమర్పించే అర్జీలు మరింత నాణ్యంగా, వేగంగా పరిష్కారం కావాలన్న ఉద్దేశ్యంతో 'జగనన్నకు చెబుదాం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయమే ఈ కార్యక్రమాలను పర్యవేక్షించిందంటే అర్జీల పరిష్కారానికి గత ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇచ్చేదో అర్థమవుతుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 'స్పందన' పేరు తొలగించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)గా మార్పు చేసింది. పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ అర్జీల పరిష్కారంపై మాత్రం కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో కొత్త నాటకానికి తెర తీసింది.

రెవెన్యూ శాఖలో అత్యధికం

- గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలను పరిశీలిస్తే అత్యధికంగా రెవెన్యూ, సర్వే విభాగాల్లోనే ఉన్నాయి. రెవెన్యూలో 18,363 ఫిర్యాదులు అందాయి. ఇందులో రికార్డు ఆఫ్ రైట్స్‌కు సంబంధించి మ్యూటేషన్స్ ఫిర్యాదులు 5074 రాగా, 4724 పరిష్కారం కాగా, 350 పెండింగ్‌లో ఉన్నాయి.
- రెవెన్యూ రికార్డులలో పేర్లు, రిలేషన్, ఆధార్, మొబైల్ నంబరు తదితర ఎంట్రీస్‌లో సవరణ కోసం వచ్చిన ఫిర్యాదులు 4623 కాగా, 4141 పరిష్కారం అయ్యాయి.
- సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి రీ సర్వేలో 3694 ఫిర్యాదులు రాగా, 2797 పరిష్కారం కాగా, 897 పెండింగ్‌లో ఉన్నాయి.
- రీ సర్వేలో భూమి విస్తీర్ణాలలో వచ్చిన తేడాలు సరిదిద్దడం కోసం 2381 ఫిర్యాదులు రాగా, 1712 పరిష్కారం కాగా, 669 పెండింగ్‌లో ఉన్నాయి.
- ఆస్తుల వివాదాలు, క్రిమినల్ ట్రెస్పాస్, సివిల్ వివాదాలు, మనీ మ్యాటర్స్‌కు సంబంధించి 1308 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 1194 పరిష్కారం కాగా, 114 పెండింగ్‌లో ఉన్నాయి.
- ఆర్ఓఆర్ డేటాలో సవరణలపై 1038 అర్జీలు వచ్చాయి. ఇందులో 975 పరిష్కరించగా, 63 పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించిన క్రమబద్ధీకరణ కోసం 1011 అర్జీలు వచ్చాయి. ఇందులో 846 పరిష్కారం కాగా, 165 పెండింగ్‌లో ఉన్నాయి.
- పట్టాదారు పాసుపుస్తకాల జారీ కోసం 809 అర్జీలు వచ్చాయి. ఇందులో 723 పరిష్కారం కాగా, 86 పెండింగ్‌లో ఉన్నాయి.
- ఎఫ్ లైన్స్ (బౌండరీ డిమార్కేషన్)కు సంబంధించి 778 ఫిర్యాదులు రాగా, ఇందులో 678 పరిష్కరించగా, 100 పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా రెవెన్యూకు సంబంధించి 15,620 అర్జీలు పరిష్కారమయ్యాయి. ఇంకా 2743 పెండింగ్‌లో ఉన్నాయి.
- సర్వే సెటిల్‌మెంట్ అండ్‌ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో 9301 అర్జీలకు 7096 పరిష్కారమై, 2205 పెండింగ్‌లో ఉన్నాయి.
- పోలీసుశాఖకు సంబంధించి 3267 ఫిర్యాదులు రాగా, 270 పెండింగ్‌లో ఉన్నాయి.
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో 1127 అర్జీలు రాగా, 59 పెండింగ్‌లో ఉన్నాయి.
- పంచాయతీరాజ్ శాఖలో 385 అర్జీలు రాగా, 39 పెండింగ్, ఏపీఎస్‌పీడీసీఎల్‌కు సంబంధించి 263 అర్జీలు రాగా, 25 పెండింగ్‌లో ఉన్నాయి.
- పౌరసరఫరాల శాఖలో 244 అర్జీలు రాగా, 19 పెండింగ్‌లో ఉన్నాయి.
- రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌లో 233 అర్జీలు రాగా, 15 పెండింగ్‌లో ఉన్నాయి.
- గృహ నిర్మాణశాఖలో 189 అర్జీలు రాగా, 4 పెండింగ్‌లో ఉన్నాయి.
- పాఠశాల విద్యకు సంబంధించి 130 అర్జీలు రాగా, 9 పెండింగ్‌లో ఉన్నాయి.
- ఇక మిగతా అన్ని డిపార్టుమెంట్లలో మొత్తం 1495 అర్జీలు వచ్చాయి. ఇందులో 1360 పరిష్కారం కాగా, 135 పెండింగ్‌లో ఉన్నాయి.

వేలాదిగా పెండింగ్

ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలలో వివిధ కారణాలతో పరిష్కారానికి నోచుకోనివి వేలాదిగా ఉంటున్నాయి. నిర్ణీత గడువులోపు పరిష్కారం కాని అర్జీల సంఖ్య పెరిగిపోతోంది. రీ ఓపెన్ అవుతున్నది కూడా అధికమేనని సమాచారం. మండల స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో తమ సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకుంటే పరిష్కారమవుతాయన్న నమ్మకంతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు కడపకు వస్తుంటారు. సమస్యలు సావధానంగా వింటున్న కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇస్తుంటారు. వాస్తవానికి పరిష్కారం కాగితాలకే పరిమితం అవుతోంది తప్ప క్షేత్ర స్థాయిలో సమస్యలు అలాగే ఉన్నాయి. పారదర్శకంగా విచారణ జరిపి సంతృప్తికర స్థాయిలో పరిష్కారాలు లభించలేదు. దీంతో వచ్చిన వారే మళ్లీ మళ్లీ వస్తూ మహాజర్లు సమర్పించుకోవాల్సిన వస్తోంది. గత సంవత్సరం జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి రాష్ట్రంలో ఎన్టీయే కూటమికి అధికారం దక్కింది. అదే నెల 12వ తేదీ మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం జరిగింది.



ప్రజల అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

ఆ నెల 17వ తేది సోమవారం నుంచి జరిగిన గ్రీవెన్స్‌సెల్ మొదలు ఈనెల 6వ తేదీ వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా మొత్తం 34,997 అర్జీలు వచ్చాయి. ఇందులో టాప్ టెన్ డిపార్టుమెంట్ల ద్వారా వచ్చిన అర్జీలు 33,502 కాగా ఇతర అన్ని శాఖల నుంచి వచ్చినవి 1495 ఉన్నాయి. మొత్తం పరిష్కరించామంటున్న అర్జీలు 29,474 కాగా పెండింగ్‌లో ఉన్నవి 5523 ఉన్నాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందన పేరు మార్పుతో సరిపెట్టుకోకుండా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

12న 'యువత పోరును'ను జయప్రదం చేయాలి



'పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈనెల 12వ తేదీ తలపెట్టిన 'యువత పోరు'ను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 'యువత పోరు'కు సంబంధించిన పోస్టర్లను బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి కూపాలు కదిలే రీతిలో యువత పోరును విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించకుండా వారిని చదువుకు దూరం చేయాలని చూస్తున్న ప్రభుత్వం తక్షణమే కపట నాటకాలు కట్టిపెట్టాలని సూచించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3900కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. దీనివల్ల వారు చదువులు ఆపాల్సి వస్తోందన్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పిల్లల ఫీజులకు అవసరమైన డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018–19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టి పోయిన రూ.1800కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. అలాగే 2023–24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదన్నారు. బకాయిలతో కలిపి ఇప్పటి వరకూ రూ.3900కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేవారు. లేనిపక్షంలో విద్యార్థులు తిరగబడటం ద్వారా తలెత్తే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, నగర అధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.



మాసమంతా పవిత్రమే
రంజాన్‌లో సెహరి, ఇఫ్తార్‌లను ఆకలి దృష్టితో కాకుండా ఆధ్యాత్మిక దృష్టితో స్వీకరిస్తాం. పుణ్యఫలాలు అందరికీ దక్కాలని ఆశిస్తాం. ఉన్న ఆహారాన్ని ఒకరికొకరు పంచుకుంటాం. దీనివల్ల అందరూ ఒకటేనన్న భావన చేకూరుతుంది. పవిత్రమైన మాసం కోసం ఏటా ఎదురుచూపులో ఎంతో ఆనందం లభిస్తోంది.
- షేక్ అర్షద్ అలీబాష, నబీకోట కడప

ఆరోగ్యం, ఆనందం
రంజాన్ సందర్భంగా నిర్వహించే సెహరి, ఇఫ్తార్‌లు మనలో ఇతరులకు ఇచ్చే, పంచుకునే గుణాన్ని పెంచుతాయి. ఆహారం, ఆకలి తీర్చడం కోసమని భావించక ధార్మికతను పాటించేందుకు ఉపయోగపడతాయి. దీంతోపాటు పుష్టికరమైన ఆహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. - షేక్ అబ్దుల్ షబ్బీర్, ట్రంకురోడ్డు, కడప

ఐక్యతకు.. ధార్మికతకు ప్రతిరూపం
సెహరి..ఇఫ్తార్

తెల్లవారుజాము 3.00 గంటల సమయం. ఆ ప్రాంతమంతా నిద్ర మేల్కొంది. పెద్ద పెద్ద బట్టీ పొయ్యిలు పొగలు కక్కుతున్నాయి. టీ హోటళ్లలో చాయ్ వాసన గుబాళిస్తోంది. పక్కనే ఉన్న మసీదు మినార్లు విద్యుద్దీపాల వెలుగులో ధగధగలాడుతున్నాయి. అస్సాలాము అలైకుమ్ భాయ్‌సాబ్.. అంటూ పలకరింపులు వినిపిస్తున్నాయి. కొందరు హోటళ్ల వైపు వెళుతుంటే, మరికొందరు మసీదు వైపు వడివడిగా వెళుతున్నారు. అరగంటకల్లా ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. అత్తరు సువాసనలు ఆ ప్రాంతంలో మెత్తని పరిమళాన్ని పంచుతున్నాయి. ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత విస్తరించి ఉంది. ఇదంతా రంజాన్ మాస సందడి గురించే. ఉదయం సెహరి, సాయంత్రం ఇఫ్తార్‌ల సమయాల్లోనే కనిపించే ప్రత్యేకత గురించే. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో.. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కడపలో ఉపవాస దీక్షలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.
-కడప కల్చరల్

శక్తికొద్దీ సేవలు

ఆధ్యాత్మికతకే కాకుండా సేవా భావానికి కూడా ప్రతీక రంజాన్ మాసం. ఇటీవల ఈ మాసం సందర్భంగా యువత కలిసికట్టుగా ఉపవాస దీక్షల కోసం సెహరీకి ఏర్పాట్లు చేస్తున్నారు. కొందరు యువకులు కమిటీలుగా ఏర్పడి తమ సమీపంలోని మసీదుల్లో ఈ మాసమంతా సెహరీని ఏర్పాటు చేస్తున్నారు. నెలరోజులపాటు దాతల సహకారంతో తమ సేవా భావాన్ని ప్రదర్శిస్తూ రోజేదార్ల సేవలో తరిస్తున్నారు. పలు హోటళ్లలో ఇటీవల సెహరీ ప్యాకేజీలను అందిస్తున్నారు. రంజాన్ మాసంలో సెహరీ తయారీ కోసం ప్రత్యేక వంటకాల తయారీ కోసం ప్రత్యేకంగా నిపుణులను రప్పిస్తున్నారు. వాటి తయారీలో ఎంతో అనుభవం గల వారు హైదరాబాదు, ముంబయి తదితర ప్రాంతాల రంజాన్ వంటకాల రుచులను మన ప్రజలకు అందిస్తున్నారు. నగరంలోని కృష్ణా సర్కిల్ వద్దగల షాహీదర్బార్ హోటల్‌లో పదిహేనేళ్లుగా రోజేదార్ల కోసం సెహరీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ హోటల్‌లో ప్రత్యే కంగా లక్కీ డ్రాపెట్టి విజేతలకు ఉమ్రా యాత్ర అదృష్టాన్ని కల్పిస్తుండడం విశేషం. ఇలాంటి ప్రత్యేకమైన ఆఫర్లను ఇతర హోటళ్లలో కూడా నిర్వహిస్తున్నారు.





ఎంతో మార్పు

పాతికేళ్ల కిందట రంజాన్ మాసాన్ని సాదాసీదాగా నిర్వహించుకునే వారు. ప్రస్తుతం సెహరీ ఏర్పాట్లు ఇళ్లల్లోనే కాకుండా మసీదులు, హోటళ్లలో కూడా కొనసాగుతుండడం మార్పునకు నిదర్శనం. అప్పట్లో సెహరీ ఏర్పాట్ల భారమంతా ఇంటి యజమానులైన మహిళలపైనే ఉండేది. విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదు గనుక సెహరీ, ఇఫ్తార్ వంటకాలు సిద్ధం చేసే ఏర్పాట్లలో రాత్రి పూర్తి సమయం నిద్రపోలేక అలిసిపోయేవారు. సెహరీ స్వీకరణలో అందరూ ఒకచోట చేరి ఒకరి వంటకాలను పంచుకుంటూ వాటితోపాటు ఆప్యాయతలను పంచుకునేవారు. ఆ ఆనందంలోనే అలసటను దూరం చేసుకునేవారు. ఇప్పుడు కూడా ఆప్యాయతలకు దూరం కాకపోయినా ప్రత్యేక వంటకాల స్వీకరణ మసీదు, హోటళ్లలో కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు ధనవంతులు తమ సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు సెహరీ ఏర్పాట్ల కోసం జకాత్ సొమ్మును అందజేసేవారు. దీంతో ఆ అందరి మధ్య గౌరవభావం, అభిమానం నెలకొంటోంది. మరికొందరు రోజంతా అలిసిపోయి ఇఫ్తార్‌కు వచ్చే వేళలో పండో, కాయో చేతబట్టుకుని మసీదుకు వస్తున్నారు. అందరూ ఒకచోట కలిసి తాము తెచ్చిన ఫలాలను పంచుకుంటూ దైవం పుణ్య ఫలాలను ప్రసాదించాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఇందులో పేద, ధనిక పట్టింపు లేకుండా అందరూ కలిసిమెలిసి ఆప్యాయంగా ఆనందాలను పంచుకుంటున్నారు. ఇక పలుచోట్ల హిందువులు సైతం ఇఫ్తార్ విందులు ఇస్తూ సోదరభావాన్ని పెంచుతున్నారు. ఇలా రంజాన్‌లోని సెహరీ, ఇఫ్తార్‌లు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. సమాజంలో ధార్మికతను, ఐక్యతను ప్రతిరూపంగా మారాయి.

అద్భుతమైన అనుభూతి



ఉదయం సెహరీ సందర్భంగా ఇంట్లో ఆహారం స్వీకరించినా ఇఫ్తార్ సమయంలో రోజేదార్లు అందరూ ఒకేచోట కలుసుకుంటాం. రంజాన్ శుభవేళలో ఇలా అందరం ఒకచోట కలిసి ప్రార్థనా సమయపు ఆహారమైన ఇఫ్తార్ స్వీకరించడం అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది.
– షేక్ మమ్మద్‌గౌస్, రవీంద్రనగర్, కడప

జిల్లాలో హలీం వ్యాపారం

ఉభయ వైఎస్సార్ జిల్లాలో రంజాన్ మాసం సందర్భంగా రంజాన్ ప్రత్యేక సంప్రదాయ వంటకమైన హలీం వ్యాపారం బాగా సాగుతోంది. పుష్టికరమైన ఈ వంటకంపై రోజేదార్లతో పాటు సాధారణ ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

- **50** కడప నగరంలోని హలీం సెంటర్లు
- **400** ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో హలీం సెంటర్లు
- **6** రూ. కోట్లలో హలీం అమ్మకాలు అంచనా..

దైవం ఇచ్చిన వరం..



రంజాన్ మాసంలో రోజేదార్లకు సెహరీ అవకాశం కల్పించే భాగ్యం దక్కడం దైవం ఇచ్చిన వరంగా భావిస్తున్నా. నెలంతా రాత్రింబవళ్లు పని చేసే కార్మికుల వల్లే సాధ్యమవుతోంది. సెహరీ, హలీం తయారు చేసే వాళ్లను హైదరాబాద్ నుంచి పిలిపించాం. ఉడతాభక్తిగా ఈసారి మా తరఫున ఒకరికి ఉమ్రా యాత్ర చేసే అవకాశం కల్పించాం. -ఎస్.ఎండీ ఆజం, హోటల్ యజమాని, షాహీ దర్బార్

భూమి ఒకరిది.. కట్టబెట్టింది మరొకరికి..

- రెవెన్యూ శాఖలో అడ్డగోలు ఆర్డర్లు
- ఖాజీపేట మండలంలో హక్కుదారులను విస్మరిస్తున్న తహసీల్దార్
- కోర్టు ఉత్తర్వులను పెడచెవిన పెట్టిన అధికారి
- హక్కులున్నా ఆన్‌లైన్ చేయని వైనం
- ప్రత్యర్థులకు అదే భూమికి సర్టిఫికెట్ జారీ


గోపాల్‌రెడ్డి నేతృత్వంలో ఉన్న పశువుల షెడ్

సాక్షి ప్రతినిధి, కడప : రైలు బండిని నడిపేదీ పచ్చా జెండాలే.. బతుకు బండిని నడిపేది పచ్చనోటే లే.. అన్నాడు ఓ సినీ గేయ రచయిత. ఆ గీతాన్ని ఆదర్శంగా తీసుకున్న కొంత మంది అధికారులు జీతం కంటే, గీతమే ముఖ్యమని మురిసిపోతున్నారు. ఈ తంతు రెవెన్యూశాఖలో మరింత అధికంగా ఉంది. డబ్బుంటే కానిదీ లేదని కొందరు అధికారులు రుజువు చేస్తున్నారు. హక్కులను సైతం కాలరాస్తున్నారు. డబ్బులిస్తే హక్కుదారులను కాదని, అదే భూమి వైరిపక్షానికి చెందినదిగా ధ్రువీకరణ చేస్తున్నారు. ఇలాంటి ఉదంతం తాజాగా ఖాజీపేట మండలంలో వెలుగు చూసింది. 60 ఏళ్ల నుంచి ఉన్న హక్కుల ఆధారంగా ఆన్‌లైన్ చేయాలని అభ్యర్థిస్తే తహసీల్దార్ చేయకపోగా, మిగులు భూమిగా ఆన్‌లైన్‌లో చూపుతున్న ఆ భూమి ఇళ్ల స్థలాలకు చెందినదంటూ ధ్రువీకరించారు. ధ్రువీకరణ ఆధారంగా ఘనత వహించిన రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏకంగా ఏడుగురి పేరుతో 9.5 సెంట్ల చొప్పున రిజిస్ట్రేషన్ సైతం చేయించారు.

పక్కా రికార్డులున్నా..

ఖాజీపేట మండలం చెముళ్లపల్లె పొలంలో సర్వే నంబర్ 393/1, 393/3, 394/1ఏ పరిధిలో 2 ఎకరాల పొలాన్ని కల్లూరు తిరుపతిరెడ్డి, పిచ్చిరెడ్డి అనే సోదరుల నుంచి ములపాకు లక్ష్మమ్మ కొనుగోలు చేసింది. ఆ మేరకు డాక్యుమెంట్ నంబర్ 4239/1965 ద్వారా 1965 ఫిబ్రవరి 5లో రిజిస్ట్రేషన్ అయింది. అప్పటి నుంచి ఆ భూమి ములపాకు లక్ష్మమ్మ ఆధీనంలోనే ఉంది. 1994 ఫిబ్రవరి 10న మనువరాలైన ములపాకు సుశీలమ్మకు రిజిస్టర్డ్ వీలునామా రాయించింది. నేషనల్ హైవే రహదారి విస్తరణకు పోనూ 1.18 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఆ భూమిపై తనకు హక్కులున్నాయంటూ అదే గ్రామానికి చెందిన పత్తి బయపురెడ్డి 2010లో మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. 2019లో కోర్టు సుశీలమ్మకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తీర్పుపై బయపురెడ్డి జిల్లా కోర్టుకు అప్పీలుకు వెళ్లారు. జిల్లా కోర్టు సైతం ఏఎస్ 9/2019 డీఫాల్ట్ 2025 ఫిబ్రవరిలో కొట్టి వేసింది. ఇవన్నీ పక్కా రికార్డులున్నా, సుశీలమ్మ తరుపు హక్కుదారులకు ఆన్‌లైన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు సమ్మతించలేదు.

సిబ్బందిని సెలవులో పంపి సర్టిఫికెట్ జారీ

వీలునామా రిజిస్ట్రేషన్ కల్గి ఉన్న సుశీలమ్మ నుంచి కొత్తపేటకు చెందిన గోపాల్‌రెడ్డి ఆ భూమి కొనుగోలు చేశారు. ఆమేరకు డాక్యుమెంటు నంబర్ 5779/2022 ద్వారా రిజిస్ట్రేషన్ అయింది. కాగా జిల్లా కోర్టులో బయపురెడ్డి అప్పీల్ కొట్టి వేసిన తర్వాత ఫిబ్రవరి 18న అన్నీ ఆధారాలు అందజేసి గోపాల్‌రెడ్డి ఆన్‌లైన్ చేయాల్సిందిగా తహసీల్దార్‌ను అభ్యర్థించారు. పక్షం రోజుల తర్వాత మార్చి 4న రిజిస్ట్రేషన్ ద్వారా సంక్రమించి, స్వాధీన అనుభవంలో ఉన్న భూమి డాక్యుమెంట్లు హక్కుపత్రాలు అందించి మ్యూటేషన్ చేయాల్సిందిగా కోరారు. తహసీల్దార్ వారి అభ్యర్థన పెడచెవిన పెట్టడమే కాకుండా, అదే రోజు ఆ భూమిని బయపురెడ్డి హక్కుదారుడిగా సర్టిఫికెట్ జారీ చేశారు. మామిడి చెట్లు, పశువుల షెడ్డు ఉన్న ఆ స్థలం బయపురెడ్డికి చెందిన ఇళ్ల స్థలాలుగా ధ్రువీకరించారు. స్థానికంగా వీఆర్వో, సర్వేయర్ సంతకాలతో నిమిత్తం లేకుండా ఆర్ఐ, డీటీలతో బలవంతంగా సంతకాలు చేయించినట్లు సమాచారం.


పొలంలో ఉన్న మామిడి చెట్లు

వంతపాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

డబ్బులిస్తే 'నందిని పంది, పందిని నంది' చేయగల సమర్థత కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాయానికి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. చెముళ్లపల్లె వ్యవహారంలో కూడా ఆ విషయం తేటతెల్లమైంది. సర్వే నంబర్ 394/1ఏలో మిగులు భూమిగా ఆన్‌లైన్‌లో చూపుతోంది. అయినా రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్చి 5న ఏడుగురి పేర్లతో రిజిస్ట్రేషన్ చేసింది. ఒక్కొక్కరికి 9.5 సెంట్ల చొప్పున డాక్యుమెంట్ల నంబర్లు 1813/2025, 1814, 1817, 1819, 1820, 1821, 1822/2025తో రిజిస్ట్రేషన్లు చేసింది. సామాన్యులు రిజిస్ట్రేషన్‌కు వెళితే ఆన్‌లైన్ లేదని యక్షప్రశ్నలతో ముప్పు తిప్పలు పెట్టే యంత్రాంగం .. ముందు రోజు తహసీల్దార్‌తో సర్టిఫికెట్ పొందడం, వెంటనే రికార్డులు పరిశీలించకుండా రిజిస్ట్రేషన్లు చేయడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు బాధితుడు గోపాల్‌రెడ్డి వాపోతున్నారు. అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారని తెలిపారు. మామిడి చెట్లు, షెడ్డు ఉన్న పొలాన్ని ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ చేయడం వెనుక ఒక్క రోజులోనే లక్షలు చేతులు మారడంతోనే ఇలా చేశారని ఆరోపిస్తుండడం గమనారహం.

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలీ

కడప కల్చరల్ : సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మిల్లెట్ల బుల్లెట్‌గా పేరుగాంచిన ప్రముఖ ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. ఆదివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఇంటాక్, ఆర్ట్స్ కళాశాల, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్యల సంయుక్తాధ్వర్యంలో 'సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడారు. ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారం వల్ల ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, ఆహార విషయంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. దేశంలోనే మన రాయలసీమ ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని, ఇందుకు కారణం...ఆది నుంచి ఇక్కడ రాగి, సజ్జ, జొన్న, కొర్రలు లాంటి ఆహారమేనని తెలిపారు. ముందుతరంలో సీమలో 170 రకాల తృణ ధాన్యాలు పండేవని, ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారని, ఇప్పుడు పది శాతానికి తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తున్న విషయమన్నారు. సిరిధాన్యాలు వాడితే రక్తం పలచబడుతుందని, గుండె సంబంధిత వ్యాదులు రావని తెలిపారు. పురాణాల్లో కూడా చిరుధాన్యాల ప్రాధాన్యత పేర్కొన్నారని వివరించారు. కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు లయన్ కె.చిన్నపరెడ్డి, టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి, క్యాంపు చైర్మన్, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు ఎ.వెంకటసుబ్బయ్య, కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రొఫెసర్ ఎం.గురుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భారతావనిగా తీర్చిదిద్దాలి

పులివెందుల టౌన్ : సిరి ధాన్యాలను ప్రోత్సహించి ఆరోగ్య భారతావనిగా తీర్చిదిద్దాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత స్వతంత్ర ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త, ది మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా, కృషిరత్న డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. స్థానిక రాణితోపు పార్కు ఈట్ స్ట్రీట్‌లోని సిరి సంజీవని ది మిల్లెట్ కేఫ్ అధినేత వరద ప్రకాష్‌రెడ్డి, ప్రమీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిరి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖాదర్‌వలి మాట్లాడారు. సిరి ధాన్యాలు వాడటం వల్ల బీపీ, షుగర్, నరాల బలహీనత, తదితర రుగ్మతలు నయమవుతాయన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన వారికి సిరి ధాన్యాలు ఎలా వాడాలో, వాటి ఉపయోగం, ఏ సమయంలో ఎలా తీసుకోవాలి తదితర వాటి గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సొంతగూటికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు


మాజీ ఎమ్మెల్యే రాచమల్లు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు ఆదివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. దీంతో టీడీపీకి గట్టి షాక్ తగిలినట్లయింది. వాస్తవానికి మున్సిపాలిటీలో 41 కౌన్సిలర్ల స్థానాలకు గడిచిన ఎన్నికల్లో 40 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని విభేదించి గత ఎన్నికల కంటే ముందే కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీపై టీడీపీ దొడ్డిదారిన పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది. వివిధ రకాలుగా ప్రయత్నించి పది మందికిపైగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. దీంతో ఎన్డీఏ కూటమి కౌన్సిలర్ల సంఖ్య దాదాపుగా 20కి చేరింది. ఇదిలా ఉంటే అక్కడ తమకు సముచిత స్థానం కల్పించడం లేదని, తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ముగ్గురు కౌన్సిలర్లు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సొంత ఇంటికి వచ్చినట్లు సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పార్టీ కండువా కప్పి వీరిని ఆహ్వానించారు. 8వ వార్డు కౌన్సిలర్ రాగుల శాంతి, 39వ వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్‌కుమార్, 40వ వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిన కౌన్సిలర్లు తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నట్లు రాచమల్లు తెలిపారు. మరికొందరి కౌన్సిలర్లును పార్టీలోకి రావాలని టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, బలిమిడి వెంకటలక్ష్మి, జయంతి, నూకా నాగేంద్రారెడ్డి, వంశీధర్‌రెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లావణ్య, వైఎస్సార్‌సీపీ నియోజవర్గ యూత్ ఇన్‌చార్జి ద్వార్శల గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టును బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి


జిల్లా ఎస్పీకి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కడప కార్పొరేషన్ : జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డిని బెదిరించిన వేంపల్లి మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు జీవీ రమణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు కోరారు. ఆదివారం వారు జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో జరిగిన పరిణామాలపై వార్తలు రాయడం వల్ల కక్షగట్టిన మాజీ ఎంపీటీసీ రమణ.. వాట్సాప్ గ్రూప్‌లో చేసిన మెసేజ్‌ను సాకుగా చూపి బెదిరించడం తగదన్నారు. విలేకరి తప్పు చేస్తే వారి యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలే తప్ప బెదిరించడం సరికాదన్నారు. శ్రీనాథ్‌రెడ్డిని చంపుతానని బెదిరిచండం దారుణమన్నారు. మిగిలిన జర్నలిస్టులు తమపై వార్తలు రాయకుండా ఉంటారనే ఆలోచనతోనే ఇలా చేశారన్నారు. ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించాలని స్వయంగా ముఖ్యమంత్రి చెబుతుంటే.. కింది స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, సుబ్బారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శ్రీనాథ్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

వేంపల్లె : స్థానిక సాయినగర్ వీధిలో ఉన్న భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఇంటిపైకి దాడి చేయడానికి వచ్చాడని చేసిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. ఆదివారం శ్రీనాథ్‌రెడ్డి సతీమణి విజయభారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త శ్రీనాథ్‌రెడ్డి ఇంటిలో లేని సమయంలో టీడీపీ నేతలు గొడవ పడడానికి ఇంటిపైకి వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఐదుగురితోపాటు మరికొందరి టీడీపీ నేతల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంతోషం.. క్షణాల్లో బుగ్గి..

- కర్ణాటకలో కడపవాసుల కారుకు ప్రమాదం
- తల్లీ కుమారుడు సజీవ దహనం
- భార్య, కొడుకు, అత్తకు గాయాలు


బోల్తా పడిన ప్రైవేటు బస్సు


కాలిపోతున్న కారు


చికిత్స పొందుతున్న బాలుడు మాన్విత్


ఆస్పత్రిలో విలపిస్తున్న గోపాల్‌రెడ్డి

చింతామణి(కర్ణాటక) : చిక్కబళ్లాపురం జిల్లా చింతామణి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సొంతూరులో బంధువులను పలకరించి సంతోషంగా బెంగళూరుకు వస్తున్న కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. తల్లీ కుమారుడు సజీవ దహనమయ్యారు.

చింతామణి సమీపంలోని కంచార్లపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని మదనపల్లి రోడ్డులో జోగ్యానహళ్లి–గోపల్లి మధ్య ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో దుర్ఘటన జరిగింది. వారు ప్రయాణిస్తున్న బ్యాలెనో కారును ప్రైవేటు బస్సు ఢీకొనడంతో కారు మంటల్లో కాలిపోయింది.

బంధువుకు కొడుకు పుట్టాడని..

ధనుంజయరెడ్డి (30), ఆయన తల్లి కళావతి (52), ధనుంజయరెడ్డి భార్య శోభారాణి, కొడుకు మాన్విత్‌రెడ్డి (3), శోభారాణి తల్లి మహాలక్ష్మీ కారులో బెంగళూరుకు బయల్దేరారు. ధనుంజయరెడ్డి కారు నడుపుతున్నారు. ఆయన తండ్రి గోపాల్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో కడప నగరంలోని రాఘవేంద్ర టౌన్‌షిప్‌లో నివాసముంటూ ఆకాశవాణిలో ఉద్యోగం చేస్తున్నారు. ధనుంజయరెడ్డి, భార్య ఐటీ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ మహదేవపురలో నివాసముంటున్నారు. కడపలో శోభారాణి అన్న సుబ్బారెడ్డికి కొడుకు పుట్టడంతో శనివారం అందరూ వెళ్లి చిన్నారిని చూసి సంతోషంగా గడిపారు. బెంగళూరుకు తిరిగి వస్తుండగా చింతామణి దగ్గర ఎదురుగా బెంగళూరు నుంచి తిరుపతికి వెళుతున్న శ్రీ భారతి ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు రోడ్డు పక్కన పడి మంటల్లో చిక్కుకుంది. అప్పటికే కారులోని వారు బయటకు ఎగిరిపడ్డారు. ధనుంజయరెడ్డి, తల్లి కళావతికి మంటలు అంటుకుని సజీవ దహనమయ్యారు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. బస్సు కూడా బోల్తా పడింది. అందులోని కొందరికి చిన్న చిన్న గాయాలు అయ్యాయి.

కారు పూర్తిగా దగ్ధం

స్థానికులు చేరుకుని క్షతగాత్రులకు సాయం చేశారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేటప్పటికి కారు పూర్తిగా దహనమైంది. జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సి, డీఎస్పీ మురళీధర్, సీఐ వెంకటరమణప్ప తదితరులు పరిశీలించారు. మృతదేహాలకు చింతామణి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శోభారాణి, కొడుకు మానివ్త్, మహాలక్ష్మీలకు ప్రథమ చికిత్స నిర్వహించి బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. ఆస్పతి దగ్గర బంధువుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆళ్లగడ్డ (నంద్యాల): కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ సమీపంలోని హైవే ధాబా సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మహానంది క్షేత్రానికి వెళ్లి దర్శనం చేసుకుని కారులో తిరిగి ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో ఆళ్లగడ్డ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సుధాకర్ (28) అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేశ్వర్లు, మనీష్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న డీఎస్పీ ప్రమోద్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల వైద్యశాలకు తరలించారు.

నేడు చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ మెయిన్ గేట్ ఎదురుగా సోమవారం చెన్నయ్ షాపింగ్ మాల్ 29వ బ్రాంచ్ సోమవారం ప్రారంభం కానుంది. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో విస్తరించిన చెన్నై షాపింగ్ మాల్ కడప నగర వాసులకు నేటి నుంచి పరిచయం కానుంది. నాణ్యమైన దుస్తులు, లేడీస్ ఫ్యాన్సీ ఐటమ్స్ అందించేందుకు షాపింగ్ మాల్ సిద్ధమైంది. ప్రముఖ సినిమా హీరోయిన్ కీర్తి సురేష్‌తో చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు సినీనటి కీర్తి సురేష్‌తో ప్రారంభిస్తుండడంతో ఆమెను ప్రత్యక్షంగా చూసేందుకు నగరవాసులు ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రజలు చెన్నయ్ షాపింగ్ మాల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఏదైనా ఖరీదైన బట్టలు కావాలంటే తిరుపతికి వెళ్లి కొనుగోలు చేసేవారు. నేడు కడప నగరానికి చెన్నయ్ షాపింగ్ మాల్ రావడంతో ప్రజలు మాల్ ప్రారంభం కోసం ఆసక్తిగా చూస్తున్నారు. హీరోయిన్ చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండడంతో యాజమాన్యం తగిన జాగ్రత్తలు చేపట్టింది. మాల్ ప్రారంభం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

సీమ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా లక్ష్మికర్‌రెడ్డి


పెద్దిరెడ్డి లక్ష్మికర్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రవాణాశాఖలో రాయలసీమ స్థాయిలో నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీటీడీ ఎన్‌టీఈఏ)కు సంబంధించి సీమ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి లక్ష్మికర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మూడోసారి ఎన్నిక కావడం విశేషం. ప్రొద్దుటూరులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఎన్నికకు సంబంధించి ఫిబ్రవరి 22న నోటిఫికేషన్, 9న నామినేషన్ ప్రక్రియను ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే అందరూ ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం మేరకు లక్ష్మీకర్‌రెడ్డిని అధ్యక్షునిగా ఎంపిక చేశారు. జోన్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఈవై ప్రకాశ్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కడప), జోన్ వైస్ ప్రెసిడెంట్-1గా కె.సువర్ణకుమారి (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, అనంతపురం), జోన్ వైస్ ప్రెసిడెంట్-2గా టీఎస్ పురుషోత్తంరెడ్డి (సీనియర్ అసిస్టెంట్, చిత్తూరు), జోన్ వైస్‌ప్రెసిడెంట్-3గా ఎస్.మనోహర్ బాబు (జూనియర్ అసిస్టెంట్, ఆదోని), జోన్‌సెక్రటరీగా టి.విజయ్‌కుమార్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, మదనపల్లె), జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఓ.యువకిశోర్ (సీనియర్ అసిస్టెంట్, తిరుపతి), జోన్ జాయింట్ సెక్రటరీ-1గా డి.నసీరుద్దీన్ (సీనియర్ అసిస్టెంట్, కర్నూలు), జోన్ జాయింట్ సెక్రటరీ-2 ఓ.నాగరాజ (సీనియర్ అసిస్టెంట్, మదనపల్లె), జోన్ జాయింట్ సెక్రటరీ-3 పి.చక్రపాణి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, చిత్తూరు), జోన్ ట్రెజరర్‌గా ఎస్.రవిప్రకాశ్ (సీనియర్ అసిస్టెంట్, హిందూపురం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని రవాణాశాఖలో పని చేసే ఉద్యోగులు, టెక్నికల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.కడపలోని రవాణా శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆటోను ఢీకొన్న లారీ


పులివెందులలో ఆటోను ఢీకొన్న లారీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణ పరిధిలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలో ఆదివారం ఆటోను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ కాలనీ, రాజీవ్ కాలనీ నుంచి కూలీ పనులు చేసేందుకు భవాని, చిన్న లక్ష్మీదేవి, నాగేశ్వరి, రాజేశ్వరి, మంజుల, వెంగమ్మతోపాటు మరో నలుగురు ఆటోలో ఇప్పట్ల గ్రామానికి వెళుతుండగా ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న 8 మంది మహిళలకు గాయాలయ్యాయి. వీరిని పులివెందుల పట్టణ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న వైఎస్సార్ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ సీఐ హాజీవలి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి రమణ, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ ఉన్నారు.

ప్రొద్దుటూరులో భారీ చోరీ

- 850 గ్రాముల బంగారు, రూ.7.70 లక్షల నగదు అపహరణ
- ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడిన దొంగలు
- విలాసవంతమైన లక్ష్మీనగర్‌లో ఘటన


రాడ్డుతో చెక్కను తొలగించి లాకర్‌ను తీసేసిన దొంగలు


చెల్లా చెదురుగా పడిన వస్తువులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని మైదుకూరు రోడ్డులో ఉన్న లక్ష్మీనగర్‌లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని పసిగట్టిన దొంగలు.. బీరువాల్లో ఉన్న బంగారు, వెండి, నగదును ఊడ్చి కొని వెళ్లారు. పెద్ద మొత్తంలో బంగారు చోరీకి గురి కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వల్లంకొండు రఘువంశీ లక్ష్మీనగర్‌లోని 19వ ప్లాట్‌లో నివాసం ఉంటున్నాడు. రఘువంశీ భార్యా, పిల్లలతోపాటు తల్లిదండ్రులు కూడా అదే ఇంట్లో ఉంటున్నారు. వీరు కొన్నేళ్లుగా వస్త్రభారతిలో బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. రఘువంశీ అన్న రవిచంద్ర బెంగళూరులో ఉంటున్నాడు. తల్లి కన్యాకుమారికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో.. వారం రోజుల క్రితం బెంగళూరులో ఉంటున్న కొడుకు వద్దకు వెళ్లింది. ఆమెను చూసేందుకు ఇంటికి తాళం వేసి రఘువంశీ, భార్యా పిల్లలు, తండ్రి సత్యంతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం బెంగళూరుకు వెళ్లాడు. రఘువంశీ ఇంటి పక్కనే వాళ్ల చిన్నాన్న అయిన మల్లికార్జున నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం ఆయన అటుగా వెళ్తూ చూడగా ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. దీంతో అతను దగ్గరికి వెళ్లి పరిశీలించగా తాళం పగులగొట్టబడి ఉన్నట్లు గుర్తించాడు. దీంతో చోరీ జరిగిందని భావించిన అతను వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. అదే సమయంలో విషయాన్ని రఘువంశీకి తెలిపాడు. రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమ ఇంట్లో చోరీ జరిగిందనే విషయం తెలియడంతో రఘువంశీ కుటుంబ సభ్యులు బెంగళూరు నుంచి హుటాహుటీనా ప్రొద్దుటూరుకు చేరుకున్నారు.

చెక్కను తొలగించి లాకర్‌ను విరిచేసిన దొంగలు

దొంగలు ఇంటి ప్రధాన ద్వారం గుండానే లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన తలుపునకు ఉన్న చెక్కను ఇనుప రాడ్డుతో తొలగించి లాకర్‌ను విరిచేశారు. రఘువంశీ కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లగానే బీరువాలు, అల్మార్లలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటంతో.. వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. తర్వాత పరిశీలించగా బీరువాలు, అల్మార్లలో ఉన్న బంగారు నగలు, నగదు, వెండి వస్తువులు కనిపించలేదు. బీరువా, అల్మార్లలోని రాళ్ల గాజులు, నల్ల పూసల దండ, నల్లపూసల గాజులు, 5 ముత్యాల హారాలు, 5 ఫ్యాన్సీ చైన్లు, నవరత్నాల హారం, అమెరికన్ డైమండ్ హారం, డైమండ్ కమ్మలు, కెంపుల హారం, కమ్మలు తదతర బంగారు ఆభరణాలు తదితర సుమారు 850 గ్రాముల బంగారు, 670 గ్రాముల వెండి వస్తువులు, రూ.7.70 లక్షలు నగదు చోరీ అయినట్లు పోలీసులకు తెలిపారు. డీఎస్పీ భావన, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ మహమ్మద్ రఫీలు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించారు. రఘువంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విలాసవంతమైన కాలనీ..
24 గంటల సెక్యూరిటీ ఉన్నా..

లక్ష్మీనగర్ విలాసవంతమైన కాలనీ. ఇక్కడ వ్యాపారులు, ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. సెక్యూరిటీ వ్యవస్థ కూడా బాగానే ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలో రెండు వీధులు ఉన్నాయి. రెండు వీధులకు రెండు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. అయితే ఎప్పుడూ ఒక ప్రధాన ద్వారం మాత్రమే తెరచి ఉంటుంది. 15 రోజులు ఒక గేట్, 15 రోజుల తర్వాత మరో గేటును తెరుస్తారు. రెండు గేట్ల వద్ద ఇద్దరేసి చొప్పున సెక్యూరిటీ గార్డులు ఉంటారు. 24 గంటల పాటు సెక్యూరిటీ సిబ్బంది కాపలా ఉంటారని కాలనీ వాసులు చెబుతున్నారు. చోరీ జరిగిన రఘువంశీ ఇంటికి సీసీ కెమెరాలు లేవని పోలీసులు చెబుతున్నారు. అలాగే అతని ఇంటి ఎదురుగా కూడా కెమెరాలు లేవని తెలుస్తోంది. కాలనీకి ప్రధాన ద్వారాల వద్ద మాత్రమే ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసులు మెయిన్ గేట్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించినట్లు సమాచారం. అయితే అందులో దొంగల జాడ కనిపించలేదని తెలుస్తోంది. దీన్నిబట్టి దొంగలు ప్రధాన ద్వారం ద్వారా కాకుండా మరెక్కడి నుంచి వచ్చి ఉంటారనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. వివిధ రకాల పనులు చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు లక్ష్మీనగర్‌లో బాడుగకు ఉన్నట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. వీరిని కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. లక్ష్మీనగర్ చుట్టూ ప్రహరీతో పాటు ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. వెనుక వైపు నుంచి దొంగలు కాలనీలోకి ప్రవేశించి ఉంటారనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దొంగల కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు.